క్లుప్తంగా

శతాధిక వృద్ధుడు మృతి


లింబగిరి (ఫైల్)

కుంటాల: మండల కేంద్రానికి చెందిన మాజీ పట్వారి సాదుల లింబగిరి (102) అనే శతాధిక వృద్ధుడు గురువారం అనారోగ్యంతో మృతి చెందారు. ఈయనకు ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. గురువారం జరిగిన అంత్యక్రియల్లో గ్రామస్తులు, పలువురు పాల్గొని సంతాపం వ్యక్తం చేశారు.

పూజలు, అన్నదానాలు

భైంసాటౌన్‌: మహాశివరాత్రి సందర్భంగా గురువారం సైతం పట్టణంలోని శివాలయాల్లో భక్తుల సందడి నెలకొంది. ఉదయం నుంచే భక్తులు ఆలయాలకు వచ్చి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాల్లో ఉపవాస దీక్షలు విరమించారు. సిద్ధార్థనగర్‌లోని ఓంకారేశ్వర్, పాతాళేశ్వర్ ఆలయంతోపాటు, సుద్దవాగు శివాలయంలో భక్తులకు అన్నదానం చేశారు.

భైంసారూరల్‌: శివరాత్రి సందర్భంగా ఒక రోజు ఉపవాస దీక్షలో ఉన్న భక్తులంతా గురువారం ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. బుధవారం రాత్రంతా శివనామ స్మరణలో ఉన్న భక్తులు తెల్లవారుజామున ఆలయాల్లో పూజలు చేశారు. మండలంలోని సిరాల, మహాగాం, చుచుంద్, ఖథ్‌గాం, వానల్‌పాడ్, సుంక్లి, చింతల్‌బోరి గ్రామాల్లోని మందిరాల్లో పూజలు చేశారు. అన్ని గ్రామాల్లోని ఆలయాల్లో టెంకాయలు కొట్టి పూజలు చేశారు.


భోసిలో అన్నదానంలో పాల్గొన్న భక్తులు

తానూరు: మండలంలోని భోసి గ్రామంలోని కాశీవిశ్వనాథుడి ఆలయం, బోరిగాం గుట్ట ప్రాంతంలోని మహాదేవుడి ఆలయం, తొండాలలో శివాలయం, ఎల్వి గ్రామంలోని రఘునాథ్ గుట్ట ఆలయాల్లో భక్తులు మొక్కలు చెల్లించుకున్నారు. భోసిలో భైంసాకు చెందిన సీతారాంసేట్ కుటుంబసభ్యులు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో గ్రామకమిటీ సభ్యులు తదితరులున్నారు.


ఖానాపూర్‌లోని మార్కండేయస్వామి ఆలయం వద్ద భక్తులు

ఖానాపూర్‌: మండలంలోని శైవక్షేత్రాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు మహా అన్నదానం, తీర్థ ప్రసాదం అందజేశారు. పట్టణంలోని మార్కండేయస్వామి ఆలయంతోపాటు దిలావర్‌పూర్, రంగపేట్, పాతఎల్లాపూర్, తర్లపాడ్ తదితర చోట్ల కార్యక్రమాలు నిర్వహించారు. ఖానాపూర్ మండలంలోని దిలావార్‌పూర్ గ్రామంలోని శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయంలో బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జాన్సన్‌నా యక్ గురువారం పూజలు చేశారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక తీర్థప్రసాదం అందించి శాలువాతో సన్మానించారు.

ఎమ్మెల్యే, ఎస్పీ పూజలు


గర్భగుడిలో ఎమ్మెల్యే రామారావు పటేల్

ముధోల్‌: మండలకేంద్రంలోని పశుపతినాథ్ ఆలయంలో గురువారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఆవరణలో భక్తులకు అన్నదానం నిర్వహించారు. ముధోల్ ఎమ్మెల్యే రామారావుపటేల్, ఎస్పీ జానకీ షర్మిల వేర్వేరుగా ఆలయంలో పూజలు చేశారు.

ఓటు వేసిన జాన్సన్‌నాయక్

ఖానాపూర్‌: బీఆర్‌ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్య జాన్సన్‌నాయక్ గురువారం పట్టణంలో తన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఓటర్లు తప్పనిసరిగా తమ ఓటుహక్కును సద్వినియోగం చేసుకోవాలని ఆయన వెంట నాయకులు రామునాయక్, గౌరికార్ రాజు, శ్రావణ్, దివాకర్, భీమేశ్, అర్షద్, అజయ్, నరేశ్, రఘు, లింబాద్రి తదితరులున్నారు.

బీజేపీ, కాంగ్రెస్ నాయకుల పోటా పోటీ ప్రచారం

ఖానాపూర్‌: ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ సందర్భంగా గురువారం బీజేపీ, కాంగ్రెస్ పార్టీల నాయకులు పోటాపోటీగా ప్రచారం నిర్వహించారు. పట్టణంలోని పోలింగ్ కేంద్రానికి వంద మీటర్ల దూరంలో రోడ్డు పక్కన టెంట్లు ఏర్పాటు చేసుకొని తమ పార్టీ అభ్యర్థికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని అభ్యర్థించారు. వీరితో పాటు ఉపాధ్యాయ సంఘాల నాయకులు, స్వతంత్ర అభ్యర్థి మద్దతుదారులు సైతం ఎమ్మెల్సీగా తమ అభ్యర్థికి అవకాశం కల్పించాలని ఓటర్లను కోరారు.

మక్కలకు దక్కని ‘మద్దతు’

లోకేశ్వరం: జిల్లాలో మొక్కజొన్న పంట సాగు చేసిన రైతులకు మద్దతు ధర దక్కని పరిస్థితి నెలకొంది. ఇప్పటికే చాలా ప్రాంతాల్లో పంట చేతికి వచ్చినా.. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయలేదు. దీనినే అవకాశంగా మల్చుకుంటున్న కొందరు వ్యాపారులు.. రైతుల నుంచి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర కంటే తక్కువకు కొనుగోలు చేస్తున్నారు. పంటను నిల్వ చేసుకునే సామర్థ్యం లేని రైతులు.. తక్కువ ధరకే అమ్ముకుంటూ నష్టపోతున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి మొక్కజొన్న పంట కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని కర్షకులు వేడుకుంటున్నారు.

- కొనుగోలు కేంద్రాల ఊసెత్తని సర్కార్
- తక్కువ ధరకు అమ్ముకుంటున్న రైతులు
- వ్యాపారులు ఏకం కావడంతో అన్నదాతలకు నష్టం
- ఎకరాకు 26 క్వింటాళ్లే కొనాలనే ఆంక్షలు ఎత్తివేయాలని డిమాండ్


లోకేశ్వరం-పంచగుడి రహదారిపై ఆరబెట్టిన మక్కలు

పెరిగిన సాగు..

జిల్లాలో యాసంగిలో లక్షా పది వేల ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేసినట్లు వ్యవసాయాధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. రెండేళ్లుగా సోయాబీన్ పంటలో ఆశించిన దిగుబడి రాకపోవడంతో రైతులంతా మక్క సాగు వైపు మళ్లారు. గతంలో సీజన్ చివర ధర పెరగడంతో ఎకరాకు రూ.మూడు వేల వరకు నష్టపోయామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సీజన్‌లో ఆరంభంలోనే ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మద్దతు ధర అందేలా చూడాలని అన్నదాతలు కోరుతున్నారు.


తూకం వేసిన మక్కల బస్తాలు

దళారులు చెప్పిందే రేటు..

కేంద్రప్రభుత్వం తాజాగా మొక్కజొన్న పంటకు క్వింటాల్‌కు మద్దతు ధరను రూ.2,225గా ప్రకటించింది. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో గ్రామాల్లో వ్యాపారులు రూ.2వేల లోపే కొనుగోలు చేస్తున్నారు. గతేడాది మద్దతు ధర రూ.2090 ఉంటే వ్యాపారులు మాత్రం రూ.2240 వరకు చెల్లించి పంటను కొనుగోలు చేశారు. ఈసారి మాత్రం ఆ పరిస్థితి కనిపించడం లేదు. ప్రస్తుతం రైతులు తమ పంటను రోడ్లపై కుప్పలుగా పోసి అమ్ముకుంటున్నారు. రైతుల పంటను నిల్వ చేసేందుకు గోదాంలు లేకపోవడం.. ప్రభుత్వం సైతం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో వ్యాపారులు ధరలు తగ్గించేస్తున్నారు. క్వింటాల్‌కు రూ.1950 నుంచి రూ.2100కి మాత్రమే కొనుగోలు చేస్తున్నారు. దీంతో రైతులు నష్టపోతున్నారు.

ఎకరాకు 26 క్వింటాళ్లే కొంటారట..

యాసంగిలో మొక్కజొన్న సాగు చేసే రైతులు ఎకరాకు సుమారు 35 నుంచి 45 క్వింటాళ్ల వరకు దిగుబడి సాధిస్తారు. కానీ ప్రభుత్వ లెక్కల ప్రకారం ఎకరాకు 26.80 కొనుగోలు కేంద్రాల్లో విక్రయించాలి. ఈ నిబంధన రైతులకు కష్టాలు తెచ్చిపెడుతోంది. పదెకరాలు సాగు చేసిన రైతు 40 క్వింటాళ్ల చొప్పున 400 క్వింటాళ్లు దిగుబడి సాధిస్తే ఆ రైతు వద్ద ప్రభుత్వం నిబంధనల ప్రకారం 268 క్వింటాళ్లు మాత్రమే కొనుగోలు చేస్తుంది. మిగతా 132 క్వింటాళ్ల పంటను అమ్ముకోవాలంటే మళ్లీ కష్టాలే. ఈ నిబంధనను సడలించాలని రైతులు కోరుతున్నారు.

క్వింటాల్‌కు రెండు కిలోల తరుగు ..

తూకం వేసేటప్పుడు వ్యాపారులు.. రైతుల నుంచి తరుగు పేరిట క్వింటాల్‌కు రెండు కిలోల వరకు మక్కలను అదనంగా తీసుకుంటున్నారు. దీంతో రైతులు క్వింటాకు రెండు కిలోల మేర నష్టపోతున్నారు.

తక్కువ ధరకే విక్రయిస్తున్నాం



మూడు ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేయగా 90 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయలేదు. మరోవైపు పంటను ఇళ్లల్లో నిల్వ చేసే పరిస్థితి లేదు. దీంతో మద్దతు ధర కంటే తక్కువకు రూ.2130కే వ్యాపారులకు విక్రయిస్తున్నాం. కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి.

– నగేశ్, నగర్‌తండా

గిట్టుబాటు ధర కల్పించాలి



నాలుగెకరాల్లో మొక్కజొన్న సాగు చేశా. ఆరుగాలం కష్టించి పండించిన పంటలు అమ్ముకుందామంటే అందుబాటులో కొనుగోలు కేంద్రాల్లేవు. గిట్టుబాటు ధర లేక చేనులోనే ఆరబెడుతున్నాం. ప్రభుత్వం మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులను ఆదుకోవాలి.

– జేబన్న, ధర్మోరా

ఉన్నతాధికారులకు నివేదిస్తాం

మొక్కజొన్న పంటలు కోత దశకు చేరుకున్నాయి. కొనుగోలు కేంద్రాల ఏర్పాటు విషయమై ఉన్నతాధికారులకు నివేదించాం. కానీ ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాలేదు. త్వరలోనే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులకు మద్దతు ధర అందేలా చూస్తాం.

– ప్రవీణ్‌రెడ్డి, జిల్లా మార్క్‌ఫెడ్ అధికారి

పోలింగ్ కేంద్రం వద్ద వాగ్వాదం


బీఆర్‌ఎస్ నాయకులను సముదాయిస్తున్న ఏఎస్పీ ఉపేందర్‌రెడ్డి, సీఐ, ఎస్సై

ఖానాపూర్‌: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రం గేటు వద్ద పోలీసులు, బీఆర్‌ఎస్ నాయకుల మధ్య వాగ్వాదం జరగడంతో ఆందోళన నెలకొంది. బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్య జాన్సన్ నాయక్‌తోపాటు ఆ పార్టీ నాయకులు ఓటు వేసేందుకు వెళ్తుండగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో ఇరువురి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. తాము ఓటర్లమేనని చెప్పినా పోలీసులు వినలేదని, తాము పార్టీ కండువా కప్పుకోకున్నా.. తమను అడ్డుకోవడంలో ఆంతర్యమేమిటో చెప్పాలని బీఆర్‌ఎస్ నాయకులు.. పోలీసులను ప్రశ్నించారు. పోలీసులు బీజేపీ, కాంగ్రెస్ నాయకులకు అనుకూలంగా వ్యవహరిస్తూ ఇతర పార్టీల నాయకులను అడ్డుకోవడం ఎందుకని నిలదీశారు. దీంతో ఏఎస్పీ ఉపేందర్‌రెడ్డి, ఖానాపూర్ సీఐ సైదారావు, ఎస్సై రాహుల్.. బీఆర్‌ఎస్ నాయకులను సముదాయించారు. అందరికీ ఓటు వేసే అవకాశం ఉందని.. గుంపుగా వెళ్లకుండా కాసేపు ఆగి వెళ్లాలని సూచించారు.

అర్ధనారీశ్వర అవతారంలో బసవేశ్వరుడు


యాకర్‌పెల్లిలో అర్ధనారీశ్వరుడి అవతారంలో బసవేశ్వర స్వామి

సారంగపూర్‌: మండలంలోని యాకర్‌పెల్లి బసవేశ్వర ఆలయంలో బసవేశ్వర స్వామి గురువారం అర్ధనారీశ్వరుడి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. మహాశివరాత్రి జాగరణ అనంతరం ఆలయాల్లో పరమశివుడిని పలురూపాల్లో అలంకరించగా భక్తులు తరలివచ్చారు. ఆయా ఆలయాల్లో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాల్లో భక్తులు పాల్గొన్నారు. యాకర్‌పెల్లి బసవేశ్వర ఆలయంతోపాటు ధని రాజరాజేశ్వరస్వామి, చించోలి(బి)లోని దుబ్బ రాజేశ్వరస్వామి, ఆలూరు రాజరాజేశ్వరస్వామి తదితర ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేసి అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు.


కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

త్రిశూల పూజ, కుంకుమార్చన

లోకేశ్వరం: మండలంలోని గోదావరి ఒడ్డున బ్రహ్మేశ్వర ఆలయం, లోకేశ్వరం శివాలయంలో శివరాత్రి ఉత్సవాలు ముగిశాయి. గురువారం లోకేశ్వరం శివాలయంలో త్రిశులపూజ, కుంకుమార్చన నిర్వహించారు. రాయపూర్‌కాండ్లీ, లోకేశ్వరం, పుస్పూర్, రాజూర, ధర్మోర, పంచగుడి గ్రామాల్లోని ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. లోకేశ్వరం శివాలయ ఆవరణలో ఆర్కెస్ట్రా ప్రోగ్రాంలో భాగంగా లోకేశ్వరం గ్రామానికి చెందిన పులి అవంతిక చేసిన నృత్యం ఆకట్టుకుంది. అనంతరం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో వీడీసీ సభ్యులు, ఆలయ కమిటీ సభ్యులు ఉన్నారు.

పోలింగ్ కేంద్రం సందర్శించిన కలెక్టర్

కడెం: కడెంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో పోలింగ్ కేంద్రాన్ని కలెక్టర్ అభిలాష అభినవ్, అదనపు ఎస్పీ ఉపేంద్రరెడ్డి సందర్శించారు. పోలింగ్ కేంద్రం పరిస్థితిని సమీక్షించి ఓటర్లతో మాట్లాడారు. సౌకర్యాల గురించి తెలుసుకున్నారు. అనంతరం సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆమె వెంట సీఐ సైదారావు, ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి, ఎంపీడీవో అరుణ తదితరులు ఉన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్ అభిలాష అభినవ్

ప్రశాంతంగా ముగిసిన పోలింగ్


కుంటాలలో పోలింగ్ కేంద్రం వద్ద పరిశీలిస్తున్న ఎస్పీ జానకీ షర్మిల, ఏఎస్పీ అవినాష్ కుమార్


కడెంలోని పోలింగ్ కేంద్రం వద్ద అదనపు ఎస్పీ ఉపేందర్‌రెడ్డి, సిబ్బంది


ఖానాపూర్‌లోని పోలింగ్ కేంద్రం వద్ద..


దస్తురాబాద్‌లో పోలింగ్ పరిశీలిస్తున్న సిబ్బంది


సారంగాపూర్‌లో కేంద్రంలో ఓటు వేసేందుకు బారులు తీరిన జనం


లోకేశ్వరంలోని పోలింగ్ కేంద్రంలో వైద్యశిబిరం పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్


ముధోల్‌లో పోలింగ్ కేంద్రం వద్ద పర్యవేక్షిస్తున్న ఎమ్మెల్యే రామారావు పటేల్


లక్ష్మణచాందలో పోలింగ్ కేంద్రం వద్ద ఓటర్లు


మామడలో ఓటు వేసిన శ్రీహరిరావు


తానూరులో బందోబస్తులో పోలీసులు


భైంసాలోని పోలింగ్‌కేంద్రంలో క్యూలో ఓటర్లు

కుంటాల: జిల్లావ్యాప్తంగా పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. కుంటాల జెడ్పీ పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని గురువారం జిల్లా ఎస్పీ జానకీషర్మిల, ఏఎస్పీ అవినాష్ కుమార్ పరిశీలించారు. పోలింగ్ సరళి గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. మండలంలో పట్టభద్రుల ఓట్లు 614 ఉండగా 492 మంది తమ ఓటుహక్కును సద్వినియోగం చేసుకోగా 80.13 శాతం పోలింగ్ నమోదైంది. ఉపాధ్యాయుల ఓట్లు 34 ఉండగా 33 ఓట్లు పోలయ్యాయి. ఎస్సై సీహెచ్.భాస్కరాచారి ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

సారంగపూర్ మండలంలో..

సారంగపూర్‌: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రానికి ఉదయం 11గంటల వరకు ఒకరిద్దరు రాగా.. తర్వాత భారీ సంఖ్యలో వచ్చి ఓటుహక్కును సద్వినియోగం చేసుకున్నారు. సాయంత్రం 4 గంటలకు సమయం ముగిసినా.. ఎన్నికల అధికారి మునీరొద్దీన్ సమక్షంలో కేంద్రంలోకి ఉన్న ఓటర్లు మరో గంటన్నరపాటు క్యూలైన్‌లో నిలబడి ఓటువేశారు. మండలంలో పట్టభద్రుల ఓటర్లు 981మంది ఉండగా.. 731 మంది తమ ఓటును వినియోగించుకోగా ఓటింగ్ శాతం 74.44గా నమోదైంది. ఉపాధ్యాయ ఓటర్లు 61 మంది ఉండగా 55 మంది ఓటువేయగా వీరి పోలింగ్ 90శాతంగా నమోదైనట్లు ఎన్నికల అధికారి తెలిపారు.

లక్ష్మణచాంద: మండలకేంద్రంలోని పోలింగ్ కేంద్రంలో 639 పట్టభద్రుల ఓటర్లకు గాను 485 మంది తమ ఓటుహక్కును సద్వినియోగం చేసుకోగా పోలింగ్‌శాతం 75.89గా నమోదైందని పోలింగ్ అధికారి లచ్చిరాం తెలిపారు. ఉపాధ్యాయ ఓటర్లు 46 ఉండగా ఇందులో 45 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారని ఆయన పేర్కొన్నారు.

మామడ: మండలకేంద్రంలో పట్టభద్రుల ఓటర్లు 485 మందికి గాను 386 మంది తమ ఓటు హక్కును వినియోగించుకోగా పోలింగ్ 80శాతంగా నమోదైంది. ఉపాధ్యాయ ఓటర్లు 25మంది ఉండగా 24 మంది తమ ఓటును వినియోగించుకున్నారు. డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు ఓటు వేశారు. పోలింగ్ కేంద్రాన్ని ఎస్పీ జానకీ షర్మిల, ఏఎస్పీ రాజేశ్ మీనా పరిశీలించారు.

ముధోల్‌: మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో 494 మంది పట్టభద్రుల ఓటర్లుకుగాను 381 మంది, 118 ఉపాధ్యాయ ఓటర్లకు గాను 100 మంది తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ కేంద్రాన్ని జిల్లా ఎస్పీ జానకీ షర్మిల, ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ పరిశీలించారు. ముధోల్ సీఐ మల్లేశ్, ఎస్సై సంజీవ్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

తానూరు: మండల కేంద్రంలోని ఉర్దూ జిల్లా పరిషత్ పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రం పరిధిలో పట్టభద్రుల ఓటర్లు 323 మందికి గాను 244 మంది తమ ఓటుహక్కును వినియోగించుకోగా 75 శాతం పోలింగ్ నమోదైంది. ఉపాధ్యాయ ఓటర్లు 25మందికి గాను 21 మంది ఓటు హక్కును వినియోగించుకోగా 84 శాతం పోలింగ్ నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. ఎస్సై శ్రీనివాస్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

నర్సాపూర్(జి): మండలకేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రం పరిధిలో పట్టభద్రుల ఓట్లు 528 ఉండగా 414 ఓట్లు పోలవగా 78.4 శాతం పోలింగ్ నమోదైంది. ఉపాధ్యాయుల ఓటర్లు 57 ఉండగా 53 ఓట్లు పోలవగా 92.98 శాతం పోలింగ్ నమోదైంది. ఎస్సై సాయికిరణ్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

లోకేశ్వరం: మండలకేంద్రంలోని ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని అదనపు కలెక్టర్(రెవెన్యూ) కిశోర్‌కుమార్ పరిశీలించారు. పట్టభద్రుల ఓటర్లు 760కి గాను 555 మంది.. ఉపాధ్యాయ ఓటర్లు 53 మందికి గాను 47 మంది ఓటుహక్కును సద్వినియోగం చేసుకున్నారని ఎన్నికల రిటర్నింగ్ అధికారి సంతోష్ పేర్కొన్నారు. ఆయన వెంట ఎంపీడీవో వెంకటరమేశ్, ఎస్సై అశోక్ ఉన్నారు.

కడెం: మండలకేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రం పరిధిలో పట్టభద్రుల ఓటర్లు 691గాను 466 మంది.. ఉపాధ్యాయ ఓటర్లు 29 మందికి 25 మంది ఓటు వేసినట్లు అధికారులు పేర్కొన్నారు.

బాసర: మండలకేంద్రంలోని ప్రభుత్వ బాలుర పాఠశాల పోలింగ్ కేంద్రం పరిధిలో 204 మంది ఓటర్లు ఉండగా 170 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఉపాధ్యాయుల ఓటర్లు 31 మందికి గాను 29 మంది ఓటు హక్కును వినియోగించుకున్నట్లు పీవో శ్రీదేవి తెలిపారు. ఎస్సై గణేశ్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఖానాపూర్‌: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. అంతకముందు పోలింగ్ కేంద్రాన్ని ఎస్పీ జానకీషర్మిల, ఏఎస్పీలు ఉపేందర్ రెడ్డి, రాజేశ్‌మీనా తదితరులు సందర్శించారు.

దస్తురాబాద్‌: మండలకేంద్రంలోని ప్రాథమిక పాఠశాల పోలింగ్ కేంద్రంలో ఉపాధ్యాయ ఓటర్ల పోలింగ్ వందశాతం, పట్టభద్రుల పోలింగ్ 82.33 శాతంగా నమోదైనట్లు ఎన్నికల అధికారులు గణేశ్, తిరుపతి తెలిపారు. కేంద్రాన్ని ఏఎస్పీ ఉపేందర్‌రెడ్డి పరిశీలించారు. ఖానాపూర్ సీఐ సైదారావ్, ఎస్సై శంకర్, పోలీసు సిబ్బంది తదితరులు ఉన్నారు.

భైంసాటౌన్‌: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో పట్టభద్రుల ఓటర్లు 1809 మందికి గాను 1246 మంది ఓటేశారు. ఉపాధ్యాయ ఓటర్లు 260 మందికిగాను 239 మంది ఓటు వేశారు. పట్టభద్రుల పోలింగ్ 68.87శాతం.. ఉపాధ్యాయుల పోలింగ్ శాతం 91.92 గా నమోదైంది. ఎస్పీ జానకీ షర్మిల, ఏఎస్పీ అవినాష్‌కుమార్ పరిశీలించారు.

పెంబి: మండలకేంద్రంలోని జెడ్పీఎస్ఎస్ పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రం పరిధిలో పట్టభద్రుల ఓటర్లు 198 మందికి గాను 136 మంది.. ఉపాధ్యాయ ఓటర్లు 17మందికి గాను 16 మంది ఓటుహక్కును సద్వినియోగం చేసుకున్నట్లు పీవో రమేశ్ తెలిపారు. పట్టభద్రులు ఓటింగ్ 68శాతం, ఉపాధ్యాయుల ఓటింగ్ 94శాతం నమోదైనట్లు పేర్కొన్నారు. ఎస్సై హన్మాండ్లు బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఓటు వేసిన మాజీ మంత్రి

నిర్మల్‌టౌన్‌: జిల్లా కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటుహక్కును మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి వినియోగించుకున్నారు. పాకాల రాంచందర్, ధర్మాజీగారి రాజేందర్, భాస్కర్, రమణారెడ్డి, మేడారం ప్రదీప్, గజేందర్, శ్రీనివాస్, పూదరి సాయి, ఉన్నారు.

దిలావర్‌పూర్‌: మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో ఏర్పాటు పోలింగ్ కేంద్రాన్ని ఎస్పీ జానకీ షర్మిల పరిశీలించారు. ఈసందర్భంగా అధికారులతో మాట్లాడి పలు సూచనలు చేశారు. డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు, కేంద్ర మాజీ మంత్రి, ఎస్.వేణుగోపాలచారి సందర్శించారు.

ఒకే కుటుంబంలో ఏడు ఓట్లు


ఓటుహక్కు వినియోగించుకున్న ఆరుగురు

ఖానాపూర్‌: మండలంలోని మస్కాపూర్ గ్రామానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు చిలుకూరి రాములు కుటుంబంలోని ఆరుగురు సభ్యులు ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటుహక్కును వినియోగించుకున్నారు. రాములుకు ముగ్గురు కుమారులు రామకృష్ణ, శివకృష్ణ, హరికృష్ణ కాగా చిన్నకుమారుడైన హరికృష్ణ అవివాహితుడు.. కోడళ్లు వనిత, మంజూష. ఈ కుటుంబంలోని ఆరుగురు సభ్యులు పట్టభద్రుల ఓటర్లు కాగా.. రెండో కుమారుడు ప్రభుత్వ ఉపాధ్యాయుడు కావడంతో పట్టభద్రుల ఓటుతో ఉపాధ్యాయ ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నాడు.


ఖానాపూర్‌లో ఓటు వేసిన దివ్యాంగుడు